సాక్షి
సంగారెడ్డి
గురువారం । 26 । డిసెంబర్ । 2024



మక్కపైనే మక్కువ

ఖరీఫ్‌లో వరికి ప్రత్యామ్నాయంగా జొన్న సాగును రైతులు చేపట్టారు.

వివరాలు 8లో ▸



గంజాయి పట్టివేత

గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు.

వివరాలు 8లో ▸



ప్రశ్నించే గొంతుక..

ప్రశ్నించే గళం కమ్యూనిస్టులని సీపీఎం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ అన్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



చిన్నారులకు క్రిస్మస్ కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: క్రీస్తు బోధనలు, జీవితం ప్రతీ ఒక్కరికి అనుసరణీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని పటాన్‌చెరు మండలం పాటిగ్రామ చౌరస్తాలో గల మరనాత చర్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రపంచవ్యాప్తంగా అతి పెద్ద పండుగ క్రిస్మస్ అన్నారు. విశ్వ శాంతి దూత, దేవుని కుమారుడు భూమి మీద అడుగు పెట్టిన శుభ దినం చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, సీనియర్ నాయకులు వెంకటేశ్, ధనరాజ్, చర్చి నిర్వాహకులు భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే మాణిక్‌రావు



చర్చిలో క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మెథడిస్ట్ సెంట్రల్ చర్చికు క్రైస్తవులు తరలివచ్చి ప్రార్థనలు చేశారు. క్రీస్తు బోధనలను క్రైస్తవ మత పెద్దలు వివరించారు. ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్ తదితరులు సెంట్రల్ చర్చికి వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్: అందోల్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లింగారెడ్డి తెలిపారు. బోటనీ సబ్జెక్టు కోసం జూనియర్ అధ్యాపకురాలు, ఇంగ్లిష్, గణితం, తెలుగు బోధనకు పీజీటీ, ఫిజిక్స్, మ్యాథ్స్, తెలుగు, బయోలజీ, సోషల్ సైన్స్ బోధించేందుకు టీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 27న అందోల్ గురుకులంలో నిర్వహించనున్న డెమో తరగతులకు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

దేశభక్తి, క్రమశిక్షణకు వేదికగా సీఏటీసీ

ఐఐటీహెచ్ డాక్టర్ దిగ్విజయ్ పవార్

సంగారెడ్డి జోన్: దేశభక్తి, క్రమశిక్షణకు 8వ సంయుక్త వార్షిక శిక్షణ శిబిరం (సీఏటీసీ) ఓ మంచి వేదికగా నిలుస్తుందని ఎఫ్‌ఐసీ ఎన్‌సీసీ, ఐఐటీహెచ్ డాక్టర్ దిగ్విజయ్ పవార్ పేర్కొన్నారు. సంగారెడ్డి 33వ తెలంగాణ యూనిట్ ఆధ్వర్యంలో ఐఐటీ హైదరాబాద్‌లో ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు ఈ శిబిరం కొనసాగనుంది. ఈ శిబిరానికి 33వ తెలంగాణ యూనిట్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రమేశ్ సారియాల్ నేతృత్వం వహిస్తున్నారు. పది రోజుల పాటు జరగనున్న శిబిరంలో మొత్తం 400 మంది క్యాడెట్లు హాజరయ్యారు. ఈ శిబిరంలో పరేడ్, శారీరక దారుఢ్యం, తుపాకీ వినియోగం, వ్యక్తిత్వ వికాస శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

ఆధ్యాత్మిక బాటలో..

- ఏడుపాయల దుర్గమ్మ దర్శనం
- మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు
- రూ. 192 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వనదుర్గమ్మ సన్నిధిలో సీఎం, మంత్రులు, నాయకులు

ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా జిల్లాకు రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను బహూకరిస్తున్న చర్చి నిర్వాహకులు, నాయకులు, ప్రజాప్రతినిధులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/మెదక్‌జోన్/మెదక్ కలెక్టరేట్: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బుధవారం మెదక్ జిల్లా పర్యటన ఆధ్యాత్మిక బాటలో సాగింది. సీఎం హోదాలో తొలిసారిగా మెదక్‌లో పర్యటించిన ఆయన ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రాలు ఏడుపాయల వనదుర్గామాత ఆలయాన్ని, మెదక్ చర్చిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మధ్యాహ్నం 12.15 గంటలకు హెలికాప్టర్‌లో ఏడుపాయలకు చేరుకున్న రేవంత్‌రెడ్డి నేరుగా వనదుర్గా ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. సీఎంకు అధికారులు, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి సీఎం పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

చర్చి వందేళ్ల ఉత్సవాలకు హాజరు

ఏడుపాయల ఆలయం నుంచి రోడ్డు మార్గం ద్వారా మెదక్‌కు చేరుకున్న సీఎం సీఎస్‌ఐ చర్చికి చేరుకున్నారు. ఈ చర్చి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న శతాబ్ది ఉత్సాలతో పాటు, క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య, ఇతర గురువులు రేవంత్‌రెడ్డికి ఆశీస్సులు అందజేశారు. ఈసందర్భంగా రూ. 29 కోట్లతో చర్చి ఆవరణలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

మెదక్ అభివృద్ధికి చిత్తశుద్ధితో ముందుకు

మెదక్ జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమది పేదల ప్రభుత్వంగా అభివర్ణించారు. ఘనంగా నిర్వహిస్తున్న మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈసందర్భంగా భక్తులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వందేళ్లు పూర్తి చేసుకుని మెదక్ చర్చి ఒక గొప్ప దేవాలయంగా గుర్తింపు పొందిందన్నారు. అలాంటి చర్చి అభివృద్ధికి అవసరమైన నిధులను తమ ప్రభుత్వం కేటాయిస్తుందని హామీ ఇచ్చారు. ఈ చర్చితో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్న రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వచ్చానని, మళ్లీ సీఎం హోదాలో ఈ చర్చికి వస్తానని ఆనాడు మాట ఇచ్చానని గుర్తు చేసుకున్నారు. సీఎం వెంట కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్, సంజీవరెడ్డి, మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం పలికిన కలెక్టర్

టేక్మాల్/పాపన్నపేట(మెదక్): బేగంపేట విమానాశ్రయం నుంచి ఏడుపాయలకు చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కాన్వాయ్ ద్వారా సీఎం, మంత్రులు ఆలయానికి చేరుకున్నారు. అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీఓ రమాదేవి సీఎం కార్యక్రమ నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి సమారు గంట ఆలస్యంగా వచ్చారు. దుర్గమ్మ దర్శనానికి భక్తులకు రెండు గంటలకు పైగా అనుమతి ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడ్డారు.

రూ. 192 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



చర్చి ఆవరణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, తదితరులు

జిల్లాలో రూ.192 కోట్ల అంచనా వ్యయం కలిగిన పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈపనులకు సంబంధించి ఏడుపాయల ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన శిలాఫలాలను మంత్రులతో కలిసి ఆవిష్కరించారు. రూ. 52.76 కోట్లతో వివిధ గ్రామాలను అనుసందానిస్తూ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి, రూ. ఐదు కోట్లతో ఇందిరా మహిళాశక్తి భవన నిర్మాణం, రూ. 35 కోట్లతో ఆలయం వద్ద రోడ్డు విస్తరణ, డివైడర్ల నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఎస్‌హెచ్‌జీ మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి రూ. వంద కోట్ల చెక్కును పంపిణీ చేశారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల అరెస్ట్

మెదక్ కలెక్టరేట్: సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేసి మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు పోలీస్ స్టేషన్ ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు. సమ్మె చేస్తున్న తమను అరెస్ట్ చేయడం అన్యాయం అన్నారు. సీఎం పర్యటన అనంతరం వారిని వదిలిపెట్టారు.

అట్టహాసంగా రైతు సమ్మేళనం

హాజరైన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మంత్రి కొండాసురేఖ

నర్సాపూర్/కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలం తునికి వద్ద గల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సాగు రైతు సమ్మేళనం బుధవారం అట్టహాసంగా జరిగింది. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ఆయన సతీమణి డాక్టర్ సుదేశీ ధన్‌ఖడ్, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రత్యేక హెలికాప్టర్‌లో కేవీకేకు చేరుకోగా మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. బ్యాటరీ వాహనంలో భారీ బందోబస్తు మధ్య సభా ప్రాంగణానికి తీసుకొచ్చారు. అక్కడ ఉపరాష్ట్రపతి మామిడి మొక్కనాటారు. అనంతరం సేంద్రియ ఉత్పత్తులు, ఎరువులు, జీవామృతం, వివిధ కషాయాల స్టాల్స్‌ను పరిశీలించారు. అక్కడే మహిళా రైతులు గిరిజన సాంప్రదాయ నృత్యం చేయగా ఉపరాష్ట్రపతి వారితో కలిసి స్టెప్పులేసి ఉత్సాహపరిచారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సేంద్రియ, ప్రకృతి సాగు గురించి తెలుసుకొని అభినందించారు. ఈసందర్భంగా అఖిల భారత కార్యకర్త సదస్య బాగయ్య మాట్లాడుతూ.. కేవీకే ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో 650 మంది రైతులు సేంద్రియ, ప్రకృతి సాగు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీ రఘునందన్‌రావు, ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం చైర్మన్ పీపీ రావు, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సినీ నిర్మాత సురేష్‌బాబు, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గోపి, అటారీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎన్ మీర, నామ్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీఎస్ మూర్తి, ఏపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, ఐఐఓఆర్ డైరెక్టర్ ఆర్‌కే మాథుర్ వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా కేవీకేలో ఉపరాష్ట్రపతి, గవర్నర్ పర్యటన గంట 45 నిమిషాల పాటు సాగింది. 25 నిమిషాల పాటు ఉపరాష్ట్రపతి మాట్లాడారు. సాయంత్రం 4.15 గంటలకు తిరుగు ప్రయాణం అయ్యారు. కేవీకేలో రైతు సమ్మేళనం అట్టహాసంగా ముగియడంతో అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు.



తునికి కేవీకేలో మొక్క నాటుతున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, పక్కన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



కంది రాక్ చర్చిలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న డీఆర్వో పద్మజారాణి తదితరులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కంది(సంగారెడ్డి): కంది మండల కేంద్రమైన కందిలోని రాక్ చర్చలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. చర్చిలో ఉదయం నుంచి భక్తుల సందడి నెలకొంది. క్రిస్మస్ సందర్భంగా చర్చి ఫాదర్ ఏసుపాల్ దైవసందేశాన్ని వినిపించారు. గ్రామాల్లోని అన్ని చర్చిలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు. యేసుక్రీస్తు పుట్టుకపై చిన్నారులు ప్రదర్శించిన నాటికలు,సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రిస్మస్ వేడుకలకు డీఆర్వో పద్మజారాణి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తోపాజి అనంత కిషన్ క్రిస్మస్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

సదాశివపేటలో...

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణ పరిధిలోని చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చి సామూహిక ప్రార్థనలు చేశారు. రాఘవేంద్రనగర్ కాలనీలో ప్రేమస్వరూపి మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ డేనియల్‌రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.



సదాశివపేటలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్ డేనియల్‌రాజు తదితరులు

సంగారెడ్డి టౌన్‌లో...

సంగారెడ్డిటౌన్: క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని సంగారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జన్మదినం సందర్భంగా గ్రామాల్లోని చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించి క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

90రోజుల ప్రత్యేక ప్రణాళిక

- ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలే లక్ష్యం
- ప్రతీ విద్యార్థిపై బోర్డు దృష్టి
- వెనుకబడ్డ విద్యార్థులకు అదనపు తరగతులు

నారాయణఖేడ్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఇంటర్మీడియెట్ బోర్డు 90రోజుల ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. అందులోభాగంగా వెనుకబడ్డ విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించడంతోపాటుగా ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టనుంది. ఈ 90 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతీ అధ్యాపకుడు రోజువారీ బోధన వివరాలు ముందుగానే తయారు చేసుకోని అందించాల్సివుంటుంది. జిల్లావ్యాప్తంగా 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 6,946 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్‌ను చదువుతున్నారు. ఇందులో ఫస్టియర్ విద్యార్థులు 3,797 ఉండగా సెకండియర్ విద్యార్థులు 3,149 మంది ఉన్నారు. డిసెంబర్‌లోనే సిలబస్ పూర్తిచేసి పునశ్చరణ తరగతులు నిర్వహించాలని భావిస్తున్నారు. విద్యార్థుల్లో ఎవరైనా లోనైతే ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించాలని, కళాశాలకు రాని విద్యార్థులుంటే వారిపై కూడా ప్రత్యేక దృష్టిని సారించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి, విద్యార్థి స్థాయిని బట్టి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారంలో రెండు రోజులు పరీక్షలు నిర్వహించాలని ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లకు ఆదేశించారు. ఈ ప్రత్యేక ప్రణాళిక కార్యాచరణ కేవలం ప్రభుత్వ కళాశాలలకే కాకుండా అనుబంధరంగ, ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలపైన కూడా దృష్టి సారించాలని విద్యాశాఖ సంచాలకుడు డీఐఈవోలకు సూచించారు. అన్ని యాజమాన్యాల కళాశాలల సమన్వయంతో జిల్లాల వారీగా మెరుగైన ఫలితాలు సాధ్యమని ఆ శాఖ భావిస్తోంది. ఈ మేరకు వచ్చే మూడునెలలు పాటు డీఐఈవోలు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి. ప్రతీరోజు మండలాల వారీగా కళాశాలల్ని పర్యవేక్షించాలి.



ఇంటర్ విద్యార్థులు

ఇలా ప్రణాళిక..

డీఐఈవోలు నెలవారీ క్షేత్ర పర్యటన (టూర్‌డైరీ)ని నెలవారీగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు నివేదించాలి. ఎవరైనా తరగతులకు గైర్హాజరైతే దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. వారు తరగతులకు హాజరయ్యేలా ప్రిన్సిపాళ్లకు బాధ్యతలు అప్పగించారు. ప్రతీ 15 రోజులకోసారి తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల స్థితిగతులపై చర్చించాలి. వారు ఒత్తిడి, వ్యసనాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పోలీసు, ఇతర శాఖల అధికారులు, మానసిక వైద్యులు, నిపుణులతో అవగాహన కల్పించాలి.

ఎర్రరాయి.. అవుతోంది పరాయి

- యథేచ్ఛగా ఎర్రరాళ్ల మైనింగ్
- పట్టా, ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- మొక్కుబడిగా తనిఖీలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రాంతంలో ఎర్రరాళ్ల వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎర్రరాయికి మంచి డిమాండ్ ఉండటంతో అక్రమార్కులు ప్రభుత్వ, పట్టా,అటవీశాఖ భూముల్లో క్వారీలను ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు ఎర్రరాళ్ల తవ్వేస్తున్నారు. కళ్లముందే అక్రమ తవ్వకాలు జరుపుతున్నా మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు కళ్లకు గంతలు కట్టుకుని తిరుగుతున్నారు. ఎవర్నుంచైనా ఫిర్యాదులు వెళ్తే మాత్రం మొక్కుబడిగా తనిఖీలు చేసి మమ అనిపించుకుంటున్నారు.

నిర్మాణానికి అనువైంది కావటంతోనే...

ఈ ప్రాంతంలో నిర్మాణాలకు ఎర్రరాళ్లు అనువుగా ఉండటంతో ప్రతీ ఒక్కరు వీటిని తమ భవన నిర్మాణాలకు వినియోగిస్తున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఎర్రరాళ్లకు భారీగా డిమాండ్ పెరిగింది. ఆరు అంగుళాల పొడవు తొమ్మిదంగుళాల వెడల్పు ఉన్న ఒక ఎర్రరాయి గతేడాది రూ.13 ఉండగా ఈ ఏడాది రూ.25కు చేరుకుంది. జహీరాబాద్, న్యాల్‌కల్ మండలంలోని పలు గ్రామాల్లోని క్వారీల్లో రాళ్లకు మంచి డిమాండ్ ఉండటంతో వాటికి రేటు ఇంకా ఎక్కువగా పలుకుతోంది. ఎర్రరాళ్ల తవ్వకానికి మైనింగ్‌శాఖ, రెవెన్యూ శాఖ అనుమతులు కావాలి. అవేమి లేకుండా వ్యాపారులు యంత్రాలతో రాళ్లను తీసి అమ్ముకుంటూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.



జహీరాబాద్ ప్రాంతంలోని ఎర్రరాళ్ల క్వారీలు



క్వారీ నుంచి ట్రాక్టర్ల ద్వారా ఎర్రరాళ్లను తరలిస్తున్న దృశ్యం

వందల ఎకరాల్లో క్వారీలు

జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, కోహీర్ మండలాల్లోని వందల ఎకరాల ప్రభుత్వ, పట్టా, అటవీశాఖ భూముల్లో వ్యాపారుల క్వారీలు నెలకొల్పి ఈ దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ రాళ్లను జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్, సంగారెడ్డి నియోజకవర్గాలతోపాటు కర్ణాటకకు కూడా తరలిస్తున్నారు.

యంత్రాల వినియోగం

అక్రమార్కులు ఆధునిక యంత్రాలను ఉపయోగించి మైనింగ్ చేస్తున్నారు. ఒక్కో గనిలో పదుల సంఖ్యలో ఈ యంత్రాలు కన్పిస్తున్నాయి. యంత్రాలకు కరెంట్ అవసరం ఉండటంతో కొన్నిచోట్ల అక్రమంగా కరెంట్ వాడుకుంటున్నారు. కరెంట్ లేని ప్రాంతాల్లో జనరేటర్లను వినియోగిస్తున్నారు. ఎర్రరాయిని లారీలు, ట్రాక్టర్ల సహయంతో తరలిస్తుంటారు. ప్రతీరోజు పదుల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్ల గనుల్లో కనిపిస్తుంటాయి. ఒక్కో గని నుంచి ప్రతీ నెల సుమారు రూ.20 లక్షల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు తెలిసింది. స్థానిక నాయకులతో అక్రమార్కులు చేతులు కలిపి మైనింగ్ దందా చేస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఇటీవల గనుల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించగా...కొద్ది రోజుల పాటు ఈ తవ్వకాలు నిలిచిపోయాయి. కొద్దిరోజుల తర్వాత మళ్లీ యథేచ్ఛగా మైనింగ్ మొదలుపెట్టేశారు. ఇప్పటికైనా అధికారులు అక్రమార్కుల వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్టీసీ స్పెషల్ బాదుడు

- పండుగ, వరుస సెలవులే కారణం
- 50 శాతం అదనపు చార్జి
- ప్రయాణికులకు తప్పని భారం



అధిక చార్జీ వసూలు చేసిన టికెట్

సిద్దిపేటకమాన్: సాధారణ రోజుల్లో సిద్దిపేట నుంచి రామాయంపేటకు ఆర్డీనరి, పల్లె వెలుగు బస్సులో ప్రయాణికుడి నుంచి రూ.60 చార్జి వసూలు చేస్తారు. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ ఉందని బుధవారం ప్రయాణికుల నుంచి సిద్దిపేట నుంచి రామాయంపేటకు ప్రయాణికుడి నుంచి రూ.80 (అదనంగా రూ.20లు) వసూలు చేశారు. సిద్దిపేట నుంచి తోర్నాలకు సాధారణ రోజుల్లో రూ.20 చార్జి. పండుగ నేపథ్యంలో వృద్ధుడి నుంచి రూ.30(అదనంగా రూ.10లు) వసూలు చేశారు. సిద్దిపేట నుంచి జేబీఎస్, గజ్వేల్, రామాయంపేట, మెదక్‌తో పాటు అన్ని రూట్లలో పండుగ నేపథ్యంలో ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేశారు. అదనపు చార్జి ఎందుకు వసూలు చేస్తున్నారంటూ కొన్ని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు కండక్టర్లను నిలదీశారు. దీంతో వాగ్వాదాలు జరిగాయి.

మెదక్ రూట్‌లో 50 శాతం ..

సిద్దిపేట నుంచి మెదక్ వరకు సాధారణ రోజుల్లో కంటే బుధవారం 50 శాతం అధిక చార్జి వసూలు చేశారు. ఈ రూట్‌లో మాములు చార్జి రూ.100లు కాగా క్రిస్మస్ పండుగ నేపథ్యంలో బుధవారం ప్రయాణికుడి నుంచి 50 శాతం అధికంగా రూ.150(అదనంగా రూ. 50లు) వసూలు చేశారు. సిద్దిపేట డిపో నుంచి మెదక్‌కు సాధారణ రోజుల్లో రోజూ 6 బస్సులు 21 ట్రిప్పులు నడుపుతాయి. క్రిస్మస్ రోజు 7 అదనపు బస్సులను ఏర్పాటు చేసి 18 అదనపు బస్సులను నడిపినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సులు ఖాళీగా వచ్చే అవకాశం ఉండడంతో నష్టాన్ని తగ్గించుకోవడానికి 50 శాతం అదనపు చార్జీ వసూలు చేయవచ్చని డిపో మేనేజర్ తెలుపుతున్నారు.

క్లుప్తంగా

కరాటే మాస్టర్‌కు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న పాషా

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రానికి చెందిన కరాటే మాస్టర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎం ఎస్.పాషా డాక్టరేట్ పొందాడు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 24న 'ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్', 'ఇమేర్జింగ్ అచీవర్స్ అవార్డు కౌన్సిల్' న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్' భవన్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందించినట్లు తెలిపారు. 36 ఏళ్లుగా కరాటే మాస్టర్‌గా శిక్షణ ఇస్తున్నానన్నారు. 150కి పైగా ఉచిత కరాటే శిక్షణ శిబిరాలు నిర్వహించి, 250 మందిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాంపియన్‌లుగా తయారు చేశానన్నారు. కరాటే రంగంలో తాను చేసిన కృషిని ఢిల్లీ కౌన్సిల్ గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. ఐకానిక్ పీస్ అవార్డు కౌన్సిల్ చైర్మన్ సుష్మితసేన్, డాక్టర్ విష్ణు ప్రసాద్ బరాన్ (ఫౌండర్ ఆఫ్ సోషల్ ఎమినిటీస్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్కిల్ ఇండియా), రాజ్యసభ సభ్యుడు నరేశ్ బన్సాల్, డాక్టర్ సయునర చేతుల మీదుగా అందుకున్నట్లు పేర్కొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


కప్‌ను చూపుతున్న క్రీడాకారులు

మనోహరాబాద్(తూప్రాన్): జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి 37వ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణ సబ్ జూనియర్ బాలికల జట్టు బంగారు పతకం సాధించినట్లు కోచ్ రవి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫైనల్‌లో తెలంగాణ జట్టు ఏపీ జట్టుపై 5–2 తేడాతో విజయం సాధించి కప్ సాధించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు శ్రీకృతి, గీతికా, కార్తీకలు విజయంలో అద్భుత ప్రతిభ ప్రదర్శించినట్లు తెలిపారు.

ఆర్చరీ జట్టు ఎంపిక

పటాన్‌చెరు: రాష్ట్ర స్థాయి 10 సబ్ జూనియర్ ఆర్చరీ చాంపియన్ షిప్‌కి రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలను ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కొల్లూర్ లో బుధవారం నిర్వహించారు. ఆర్చరీలోని వివిధ విభాగాలైన ఇండియన్ రౌండ్, రీకర్వ్, కాంపౌండ్ మొదలైన విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఎంపికైన వారు జనవరి 2 నుంచి 10 వరకు జైపూర్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. పోటీలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, కోశాధికారి సత్య ప్రసాద్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్వాహకులు భీమ్ సేన్, ఉప అధిపతి ప్రణయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు వసంత పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: బాలిక అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కింది బస్తీకి చెందిన లక్ష్మి బుధవారం ఉదయం కూలీ పనికి వెళ్లి 11 గంటలకు తిరిగి ఇంటికి వచ్చింది. రెండో కూతురు మానికతో కలిసి ఇంట్లో లక్ష్మి భోజనం చేస్తుండగా, పెద్ద కూతురు స్వప్న (10) బయట ఆడుకుంటుంది. భోజనం ముగించుకొని బయటికొచ్చి చూసేసరికి స్వప్న కనిపించలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆకట్టుకున్న స్టాల్స్



- సేంద్రియ సాగుకు అవసరమయ్యే పదార్థాలు ప్రదర్శన
- అవగాహన కల్పించిన నిర్వాహకులు
- సాగుపై అభిప్రాయం వ్యక్తం చేసిన రైతులు


స్టాల్‌ను పరిశీలిస్తున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్


మన బజార్ సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

నర్సాపూర్/కౌడిపల్లి(నర్సాపూర్): తునికి కేవీకేలో బుధవారం జరిగిన ప్రకృతి, సేంద్రియ రైతు సమ్మేళనం ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. సేంద్రియ సాగు చేయడానికి ఉపయోగపడే పదార్థాలతో పలు సంస్థలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. వాటి వినియోగం, అవి లభించే ప్రాంతాలు తదితర అంశాలపై రైతులకు నిర్వాహకులు అవగాహన కల్పించారు. అలాగే, రైతు సమ్మేళనం వేదికపై సేంద్రియ సాగు చేస్తున్న ఇద్దరు రైతులకు మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. అనంతరం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రైతులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

పంచగవ్య :

గో సేవయే గోవిందుని సేవ పేరుతో తెలంగాణ గో సేవ సంస్థ ఆధ్వర్యంలో స్టాల్ ఏర్పాటు చేసి పంచగవ్య లైన గో మూత్రం, గోవు పేడ, నెయ్యి, పాలు, పెరుగులపై రైతులకు అవగాహన కల్పించారు. వాటితో తయారు చేసిన పలు రకాల వస్తువులు పెట్టి వాటి వినియోగం లాభాలను తెలియజేశారు.

మన గ్రామ బజార్‌లో ఆకుల కషాయాలు :

మన గ్రామ బజార్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో పలు రకాల ఆకులతో తయారు చేసిన కషాయాలు పెట్టి అవగాహన కల్పించారు. వరిలో కలుపు నివారణకు అవసరమయ్యే కషాయాలపై, మొక్కల వేర్లకు సోకే రోగాల నివారణకు, మొక్కల ఎదుగుదలకు అవసరమయ్యే ఆకులతో తయారు చేసిన కషాయాలపై రైతులకు తెలియజేశారు. కాగా అడవి నుంచి సేకరించిన తేనె పెట్టి విక్రయించారు.

జీవామృతం :

స్టాల్‌లో సేంద్రియ సాగులో వినియోగించే జీవామృతంపై అవగాహన కల్పించారు. ఆవు పేడ, ఆవు మూత్రంతో తయారు చేసిన కషాయాలపై వివరించారు. బయో ఫర్టిలైజర్‌పై సైతం కేవీకే సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు.

ఆయిల్ సీడ్స్‌పై అవగాహన :

సమ్మేళనంలో రాజేంద్రనగర్‌కు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రిసెర్చ్ సంస్థ ప్రతినిధులు స్టాల్ ఏర్పాటు చేసి పలు రకాల ఆయిల్స్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఆముదాలు, కుసుమలు, అవిసెలు, గడ్డి నువ్వులు, నువ్వులు, పొద్దుతిరుగుడు, క్యాస్ట్రాల్ తదితర ఆయిల్స్‌పై వివరించారు.


రైతు సమ్మేళనంలో ఏర్పాటు చేసిన ఆయిల్ సీడ్స్ స్టాల్

12 ఏళ్లుగా సేంద్రియ సాగు



తాను ఎకరం పొలంలో 12 ఏళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేశాను. ప్రస్తుతం సేంద్రియ సాగు విస్తీర్ణం పెంచాను. సేంద్రియ సాగు, రసాయన ఎరువులతో చేసే వ్యవసాయానికి ఖర్చులు సమాన స్థాయిలోనే ఉంటాయి. రైతులకు సేంద్రియ సాగుతోనే మంచి లాభాలు ఉంటాయి. ఇతర రసాయనాలతో చేసే సాగు కన్న దిగుబడి తక్కువగా వచ్చినా సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో ఎక్కువ ధర లభిస్తుంది. సేంద్రియ సాగుతో భూసారం, భూమాతను కాపాడడంతో పాటు సమాజానికి మేలు చేసిన రైతులం అవుతాం.

– నరేందర్‌రెడ్డి, సేంద్రియ రైతు, చిన్నఘనపూర్ గ్రామం, కొల్చారం మండలం

ఐసీడీఎస్, కేవీకే సహకారంతో..



తాము ఐదేళ్ల నుంచి సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాం. 16 రకాల ఆకుకూరలు, కూరగాయల విత్తనాలు ఉచితంగా ఇస్తున్నారు. సేంద్రియ సాగు విధానంలో వరి, కూరగాయలు పండించి అంగన్‌వాడీ సెంటర్‌లో వండి పెడుతున్నాం. వాటిని తినడంతో బలహీనంగా ఉన్న పిల్లలు బలంగా తయారువుతారు. భావితరాల పిల్లలకు ఆస్తులతోపాటు ఆరోగ్యకరమైన పంటలను అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. తమకు ఐసీడీఎస్, ఏకలవ్య కేవీకే సేంద్రియ సాగు చేసేందుకు ఎంతో సహకారం అందిస్తున్నాయి.

– ధనలక్ష్మి, మహిళా సేంద్రియ రైతు, బండపోతుగల్ గ్రామం, చిలిపిచెడ్ మండలం

రూ. 2.50 లక్షల ఆదాయం



పాలీహౌస్‌లో 28 గుంటల్లో పాల కూరసాగుతో రూ.2.50 లక్ష ఆదాయం వచ్చింది. కేవీకే ఉద్యానవన శాస్త్రవేత్త శ్రీనివాస్, ఇతర శాస్త్రవేత్తల సూచనలతో పాలిహౌస్‌లో పాల కూర సాగు చేశాం. నాలుగు సార్లు కోతకు వచ్చింది. ప్రతీ రోజు ఉదయం కట్ చేసి అన్నారం మార్కెట్‌లో విక్రయిస్తాం. కుటుంబ సభ్యులు రోజు పని చేస్తారు. పాలిహౌస్‌లో డిమాండ్ ఉన్న పంటను సీజన్‌కు అనుకూలంగా సాగు చేస్తే మంచి ఆదాయం వస్తుంది. దీంతోపాటు తోట కూర, క్యాప్సికం పంటలు సాగు చేశా.

– సంజీవ్, రైతు రాయిలాపూర్

కూరగాయలు, కంది వేస్తున్న..



మాకు నాలుగు ఎకరాల పొలం ఉండగా ఎకరంలో సేంద్రియ, ప్రకృతి సాగులో నాలుగేళ్లుగా కూరగాలు, జొన్న, కంది, కొర్రలు, వరి ఇతర పంటలు సాగు చేస్తున్నా. మాది పెద్ద కుటుంబం. ఇంటి అవసరాలకు సరిపోనూ కూరగాయలు మార్కెట్‌లో విక్రయిస్తున్నాం. పశువుల పేడ వినియోగిస్తున్నాం. కేవీకే శాస్త్రవేత్తలు పంటను పరిశీలించి చీడపీడల నివారణకు నీమ్ ఆయిల్, ఇతర కషాయాలు తయారు చేసి ఇవ్వడంతో స్ప్రే చేసి చీడపీడలను నివారించి పంటను సాగు చేస్తున్నా. ఆదాయం వస్తుంది.

– కొర్ర శ్రీనివాస్, రైతు దేవులతండా

పశువుల పేడ ఎరువుగా వేస్తున్న..



మూడేళ్లుగా సేంద్రియ సాగు చేస్తున్నాం. కేవీకే శాస్త్రవేత్తలు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసి సేంద్రియ సాగు ఆరోగ్యానికి మంచిదని వివరించారు. దీంతో ఎకరం పొలంలో వరి పంటను సాగు చేస్తున్నాం. ఇంట్లో మూడు ఆవులు, రెండు గేదెలు ఉండటంతో పశువుల పేడ ఎరువుగా వేస్తూ సాగు చేస్తున్నాం. మాతోపాటు బంధువులకు సేంద్రియ వరి ధాన్యం ఇస్తున్నాం.

– అనసూయ రైతు, నస్కల్ గ్రామం

పండుగ పూట తీవ్ర విషాదం

- విద్యుదాఘాతంతో యువకుడు మృతి
- ఏసుక్రీస్తు శిలువ జెండా ఏర్పాటు చేస్తుండగా ప్రమాదం
- మరో ముగ్గురికి గాయాలు
- సిర్గాపూర్ మండలం ఖానాపూర్ గ్రామంలో ఘటన


రాసోలం సోపాన్

కల్హేర్(నారాయణఖేడ్): క్రిస్మస్ పండుగ పూట తీవ్ర విషాదం నెలకొంది. ఏసుక్రీస్తు శిలువ జెండా ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురు యువకులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజాపూర్ గ్రామానికి చెందిన రాసోలం సోపాన్(19) డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో సోపాన్ స్వగ్రామం ఖాజాపూర్‌కి వచ్చాడు. క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు గ్రామానికి చెందిన తోటి యువకులు బాలప్ప, దేవదాస్, మోహన్‌తో కలిసి సోపాన్ చర్చి వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పటికే చర్చి ఎదుట పాత శిలువ జెండా పైపు ఉండగా పెయింటింగ్ వేసేందుకు మళ్లీ తీస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పైపు విద్యుత్ తీగలకు తగిలింది. ఈ ప్రమాదంలో సోపాన్ తీవ్రగాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మోహన్‌కు సైతం తీవ్ర గాయాలు కాగా సంగారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని..

పురుగు మందు తాగి ఆత్మహత్య

పుల్‌కల్(అందోల్): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ క్రాంతి కథనం మేరకు.. మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ఏసు(36) ప్రతి రోజూ మద్యం తాగడానికి భార్య సుమలతను డబ్బులు అడిగేవాడు. అలాగే గొడవ పడుతుండేవాడు. మంగళవారం మద్యం తాగడానికి భార్య డబ్బులు అడిగితే ఇవ్వలేదని గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లి దుర్గమ్మ గుడి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో యువకుడు..

బెజ్జంకి(సిద్దిపేట) : అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ శంకర్‌రావు కథనం మేరకు.. స్వగ్రామమైన బెజ్జంకిలో రావుల జనార్దన్(30) చిరు వ్యాపారం చేస్తూ భార్య రేవతి, కుమారుడితో కలిసి జీవిస్తున్నాడు. ఇటీవలె ఇంటి నిర్మాణం చేపట్టగా కొంత అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక మనస్తాపం చెంది మంగళవారం ఇంటి వెనుక గల షెడ్‌లో పురుగు మందు తాగాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో కరీంనగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య రేవతి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ అదుపుతప్పి పంట చేనులో పడి..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శ్రీకాంత్ (ఫైల్)


రామాయంపేట (మెదక్): బైక్ అదుపుతప్పి పడిపోవడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఝాన్సీ లింగాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నశంకరంపేట మండలం తురకల మాందాపూర్ గ్రామానికి చెందిన అంగడి శ్రీకాంత్ (35) రామాయంపేట మండలం అక్కన్నపేటలో మంగళవారం బంధువుల ఫంక్షన్‌కు వచ్చాడు. రాత్రి 12 గంటల ప్రాంతంలో బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. అతివేగంగా బైక్ నడుపుతూ అదుపు తప్పడంతో పంటచేనులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై బాలరాజ్ కేసు నమోదు చేశారు.

పరిశ్రమలో కార్మికుడు..


రాజు హల్దార్ (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): రెయిలింగ్ విరిగి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మాయపల్లెలోని ఇథనాల్ పరిశ్రమలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ కథనం మేరకు.. తిమ్మాయపల్లె ఇథనాల్ ఫ్యాక్టరీలో ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌కు చెందిన కూలీలు పని చేస్తున్నారు. కేరీ జిల్లాలోని మియాన్పూర్ గ్రామానికి చెందిన రాజు హల్దార్(21) మంగళవారం పరిశ్రమలో చిమ్నీ పనులు పని చేస్తుండగా ప్రమాదవశాత్తు రెయిలింగ్ విరిగి సుమారు 25 మీటర్ల ఎత్తు నుంచి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన రాజును చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి బంధువు ఉత్తరాఖండ్‌కు చెందిన విశ్వాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూల్ బస్సులకు నిప్పు


కాలిపోయిన వాహనం

మిరుదొడ్డి(దుబ్బాక): గుర్తు తెలియని వ్యక్తులు స్కూల్ బస్సుకు నిప్పంటించిన ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలోని గోల్కొండ మోడల్ స్కూల్‌కు చెందిన రెండు స్కూల్ వాహనాలపై గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున పెట్రోల్ పోసి నిప్పంటించారు. మంటలు ఎగిసి పడటంతో స్థానికులు గమనించి మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వాహనాలు అగ్నికి పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న భూంపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. గోల్కొండ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు భూంపల్లి పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

- నలుగురు యువకులు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఎల్.శ్రీను కథనం మేరకు.. గుర్జకుంట వాగు సమీపంలో ఓ వెంచర్‌లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు బుధవారం వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి రైడ్ చేశాం. అక్కడ ఉన్న రాసూరి నవీన్, ఏషబోయిన కరుణాకర్, పొన్నబోయిన పవన్, చెట్కూరి శ్రావణ్‌ని అదుపులోకి తీసుకున్నాం. వారి వద్ద నుంచి 50 గ్రాముల గంజాయితోపాటు ట్రాలీ ఆటో, స్కూటీ, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ పీ.నీరేష్, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని 18 నుంచి 45 ఏళ్ల మహిళలకు గురువారం నుంచి నెల రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు సంగారెడ్డి బైపాస్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం, 9490103390, 9490129839 నంబర్లను సంప్రదించాలని సూచించారు. శిక్షణ అనంతరం మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తామని పేర్కొన్నారు.

సొంతింటి కోసం ఎదురుచూసి.. చివరికి తనువు చాలించి

అనారోగ్యంతో మహిళ మృతి


తలకొరివి పట్టిన కూతురు దుర్గాబాయి

గజ్వేల్‌రూరల్: సొంతింటి కోసం ఎదురుచూసిన ఆ మహిళ అనారోగ్యంతో బాధపడుతూ తనవు చాలించింది. కనికరించని ప్రభుత్వం.. పాలకుల నిర్లక్ష్యంతో నిరుపేదరాలి కల.. కలగానే మిగిలిపోయింది. సొంతింటి కోసం కొట్లాడే ఓపిక లేక జీవచ్ఛంలా మంచానికి పరిమితమై ప్రాణం వదిలిన ఘటన బుధవారం గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గజ్వేల్ పట్టణానికి చెందిన నాగుబాయి రోడ్డు వెడల్పులో భాగంగా ఇంటిని కోల్పోయి ప్రభుత్వం తనకు డబుల్ బెడ్‌రూమ్ ఇస్తుందనే ఆశతో కిరాయి ఇంట్లో ఉంటుంది. జీవనం గడవగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరింది. వైద్యం సహకరించకపోవడంతో డాక్టర్లు ఇంటికి తీసుకెళ్లాలని సూచించడంతో గజ్వేల్‌లోని కిరాయి ఇంటికి చేరుకోగా నాగుబాయిని ఆ ఇంటి యజమాని అనుమతించలేదు. కుటుంబ సభ్యులు పాత ఇంటి స్థలంలో రోడ్డుపైన వేశారు. దీనిని గమనించిన నాగుబాయి సమీప బంధువులు తమ పాత ఇంట్లో ఆశ్రయం కల్పించారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ బుధవారం మృతి చెందడంతో ఆమె కూతురు దుర్గాబాయి తలకొరివి పట్టింది. స్థానిక కౌన్సిలర్ మామిడి విద్యారాణి రూ. 2 వేలు, మాజీ ఎంపీపీ నాయిని సత్యలక్ష్మీ రూ.వెయ్యి ఆర్థిక సాయం అందించగా.. సూర్యవంశ ఆరెకటికె సంఘం ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పెళ్లి వేడుకకు వచ్చి..

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి
చౌటకూరు మండలంలో విషాదఛాయలు


హరీశ్ (ఫైల్)

సంగారెడ్డి : తెల్లవారితే పెళ్లి.. ఇరు కుటుంబాల్లో అంతా సందడి వాతావరణం.. ఆ రెండిళ్లకు ఆ యువకుడు దగ్గరి బంధువు.. అప్పటి వరకు పెళ్లి పనుల్లో తానే అన్ని పనులు చేస్తూ వచ్చాడు. ఇంతలోనే విధి వక్రీకరించి రోడ్డు ప్రమాదం రూపంలో యువకుడిని బలితీసుకుంది. దీంతో పెళ్లి జరగాల్సిన ఈ ఇళ్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. పెళ్లి హాజరుకావాల్సిన బంధువులంతా అంత్యక్రియలకు హాజరయ్యారు. వివరాల్లోకి వెళితే.. చౌటకూర్ మండలం శివంపేట గ్రామానికి చెందిన దేవుని మల్లేశం–బుజ్జమ్మకు హరీశ్ కుమార్ (23) ఒక్కడే కుమారుడు. స్థానికంగా ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. పుల్కల్ మండల కేంద్రంలో బుధవారం తమ బంధువుల ఇంట్లో పెళ్లి ఉండగా మంగళవారం వెళ్లాడు. అర్ధరాత్రి వరకు అక్కడే పెళ్లి పనుల్లో నిమగ్నమయ్యాడు. బుధవారం ఉదయం పెళ్లికి వద్దామని అదే రోజు రాత్రి తిరిగి స్వగ్రామమైన శివంపేటకు బైక్‌పై బయలు దేరాడు. మార్గ మధ్యలో గంగోజీపేట గ్రామ శివారులోకి రాగానే సబ్ స్టేషన్ వద్ద బైక్ అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలై రక్తపు మడుగులో పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గుర్తించి హరీశ్ ఫోన్‌ను అతడి ఫింగర్ ప్రింట్‌తో ఓపెన్ చేసి బంధువులకు సమాచారం ఇచ్చారు. అనంతరం 108 అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి దేవుని మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పుల్కల్ ఎస్ఐ క్రాంతి తెలిపారు. గ్రామస్తులతో కలుపుగోలుగా ఉండే హరీశ్ మృతితో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. అప్పటిదాకా పెళ్లి పనులు చేసిన యువకుడు అకారణంగా చనిపోవడంతో బంధువులు, కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు.

మక్కపైనే మక్కువ

వరికి ప్రత్యామ్నాయంగా రైతుల ఆసక్తి


కుందనవానిపల్లి గ్రామంలో సాగుచేసిన మొక్కజొన్న

- 7,219 ఎకరాల్లో సాగవుతున్న మొక్కజొన్న
- కళకళలాడుతున్న మెట్ట పైర్లు
- మార్కెట్‌లో కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,225

అక్కన్నపేట(హుస్నాబాద్): ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దీంతో మొక్కజొన్న సాగుపై రైతులు మక్కువ పెంచుకున్నారు. అక్కన్నపేట మండల వ్యాప్తంగా మొక్కజొన్న సాగు ఈసారి గణనీయంగా పెరిగింది. మెట్ట ప్రాంతంలో ఎటుచూసిన మొక్కజొన్న పంటతో కళకళలాడుతున్నాయి. గతేడాదితో పోల్చితే సుమారుగా రెట్టింపు సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. చెరువు, కుంటల్లో నీళ్ల పుష్కలంగా ఉన్నా, భూగర్భజలాలు తగ్గడం, పెట్టుబడి కూడా తక్కువ, పంట మార్పిడి విధానం, వేసవి రాకముందే పంట కోతకు వస్తుందనే ఆలోచనతో రైతులు మొక్కజొన్న సాగువైపు దృష్టి సారించారు. గతేడాది అక్కన్నపేట మండలంలో 4,250 వేల ఎకరాల మొక్కజొన్న సాగు చేయగా ఈ ఏడాది 7 వేల ఎకరాలకు పైగానే సాగైనట్లు వ్యవసాయ అధికారులు చేపట్టిన పంటల నమోదు ప్రక్రియలో తెలిసింది.

సాగు నీరు, పంట కాలం తక్కువే..

వరితో పోల్చికుంటే మొక్కజొన్నసాగుకు నీరు తక్కువగా అవసరం ఉంటుంది. మొక్కజొన్న చేను ప్రారంభం దశలో మినహా తర్వాత వారం రోజులకు ఒకసారి నీళ్ల పడితే సరిపోతుంది. వానాకాలంలో వరి సాగుతో పోల్చుకుంటే యాసంగిలో మొక్కజొన్న సాగుకు ఆదాయం ఎక్కువ వస్తుంది. ఈ పంట సాగు కాలం సుమారుగా 90 రోజులు మాత్రమే ఉంటుంది. అదే విధంగా భూగర్భజలాలు అడుగంటి పోకుండా ముందే పంట కోతకు వస్తుంది. ఈ నేపథ్యంలో రైతులందరూ ప్రస్తుతం ఫిబ్రవరి నెలలోనే మొక్కజొన్న పంట కోతకు వచ్చేలా సాగు చేశారు.

మద్దతు ధరకు ఎక్కువ..

కొన్నేళ్లుగా మక్క పంటకు లభిస్తున్న ధరలను చూస్తే.. 2019లో క్వింటాకు రూ.1,550 నుంచి రూ.1,750 వరకు ఉండగా క్రమంగా ఈ 2024 ఖరీఫ్ (వానాకాలం సాగు) ధర రూ.2,225గా కేంద్రం నిర్ణయించింది. ఇటీవల మద్దతు ధరకు మించి ధర పలుకుతుండటంతో రైతుల్లో ఈ పంట వైపు మరింత దృష్టి సారించేలా చేసింది. ముఖ్యంగా కోళ్లకు, పశువుల దాణా తదితర వాటికి మొక్కజొన్నను ఉపయోగించడంతో డిమాండ్ పెరిగింది. అనుకూల పరిస్థితుల్లో ఎకరాకు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. ఖర్చులన్నీ పోను ఎకరాకు దాదాపు రూ.45 వేల వరకు వస్తువుండడంతో రైతులకు లాభసాటిగా ఉంటోంది.

మక్కలకు మంచి డిమాండ్



రబీలో మొక్కజొన్న సాగు గణనీయంగా పెరిగింది. పంట మార్పిడి విధానంతో దిగుబడి బాగా వస్తుంది. ప్రస్తుతం 7 ఎకరాలకు పైగానే మొక్కజొన్న సాగు చేశాను. కానీ కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మొక్కజొన్న పంట వద్ద కాపలాగా ఉంటున్నాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లోనే ఎక్కువ ధర పలుకుతోంది.

– ఏలేటి మోహన్‌రెడ్డి, కుందనవానిపల్లి గ్రామ రైతు